క్లుప్తంగా

10 నుంచి గంగమ్మ బోనాల పండుగ

కడప కల్చరల్ : కడప నగరం రాజారెడ్డివీధిలోని గ్రామ దేవత గంగమ్మ ఆలయ 18వ బోనాల పండుగను ఈనెల 10 నుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్నారు. 10న ఉదయం 4.30 గంటల నుంచి అమ్మవారి మూలమూర్తికి 108 బిందెల పసుపు నీటితో అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం నవగ్రహాల పూజ, శాంతిహోమం, సాయంత్రం కుంకుమార్చన, అమ్మవారి మహాజ్యోతుల పూజ నిర్వహిస్తారు. 11న ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. భక్తులు అమ్మవారికి చల్లను సమర్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఊయల సేవ ఉంటుంది. 12న ఉదయం 5 గంటలకు అభిషేకం అనంతరం బోనాల సమర్పణ నిర్వహిస్తారు. అనంతరం నిజరూప దర్శనం, సాయంత్రం 6 గంటలకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహమూర్తి

కడప కల్చరల్ : జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని ఏడురోడ్ల సమీపాన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నరసింహామూర్తి, కార్యదర్శి ఖ్వాజా మస్తాన్ దీనిని ప్రారంభించారు. వేసవి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు హర్షణీయమని వారు పేర్కొన్నారు. సంస్థ పట్టణ అధ్యక్షులు రియాజ్‌బాష మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా శాఖ సంఘ సేవ కార్యదర్శి జాకీర్ హుసేన్, రహమతుల్లా, ఇతర సభ్యులు, కార్యకర్తలు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ప్రతినిధులు, మందుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతకొమ్మదిన్నె : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొలుములపల్లె పాఠశాల ఆవరణలో ఎంఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటిలో శుక్లం ఉన్న వారికి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎముకలు, కీళ్ల తదితరాలకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఎంఎం హాస్పిటల్ ప్రవీణ్ కుమార్, ఎస్ఎం అబిద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఆర్‌వైఎఫ్‌నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు సంబంధించి నూతన జ్యాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని రెవల్యూషనరీ యూత్ ఫండ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఆర్‌వైఎఫ్ అవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి జెండాను ఆవిష్కరించారు. జిల్లాలో బీసీ స్టడీ, అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్ నిర్వహించి యువతకు ఉద్యోగాలను కల్పించాలన్నారు. పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారాయుడు, ఆర్‌వైఎఫ్ నాయకులు రెడ్డెయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రామ్మోహన్‌రావు సేవలు ఎనలేనివి



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేషనల్ మజ్దూర్‌యూనియన్ వ్యవస్థాపకులు, కార్మిక నేత పి.రామ్మోహన్ రావు సేవలు ఎనలేనివని నాయకులు కొనియాడారు. రామ్మోహన్ రావు 18వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆ యూనియన్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఇందిరానగర్‌లోగల పద్మావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎన్ఎంయూఏ రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, రీజినల్ నాయకులు కొత్తకోట దాస్, రహమతుల్లా, డిపో నాయకులు శ్రీను, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

26	నగరంలోని పోలింగ్ స్టేషన్ల సంఖ్య
47	విధుల్లో పాల్గొనే సూపర్‌వైజర్ల సంఖ్య
2528	ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య
18,503	ఓటర్లుగా నమోదైన పట్టభద్రులు



ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

- ప్రారంభమైన స్లిప్పుల పంపిణీ
- పోలింగ్ సిబ్బందికి 10వ తేదీ రెండో విడత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలెక్షన్, రెవెన్యూ, పోలీసు అధికారులు సర్వే నిర్వహించి కడప నగరంలో 26పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఇప్పటికే బరిలో ఉన్న అభ్యర్థుల జాబితాతో ఫారం–7బీనోటీసు బోర్డులో పొందుపరిచారు. అప్రూవల్ చేసిన ఓటరు లిస్టులోని ఓటర్లకు రెండు రోజులుగా బీఎల్ఓలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలకు స్లిప్పులను అందజేశారు. వారు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందజేస్తున్నారు. ఇందులో పట్టభద్రులు 18,503 మంది, ఉపాధ్యాయులు 2528 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరందరికీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించారు. ఇదిలా ఉండగా పోలింగ్, కౌంటింగ్‌లకు సంబంధించి ఇప్పటికే అధికారులు ఒక విడత శిక్షణ ఇవ్వగా, రెండవ విడతగా ఈనెల 10న కలెక్టరేట్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.



ఓటరుకు స్లిప్పును అందజేస్తున్న సిబ్బంది

స్లిప్పులు అందజేస్తున్నాం!



కలెక్టర్ ఆదేశాల మేరకు అప్రూవల్ చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించి 21,031 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరికి సంబంధించిన స్లిప్పులను బీఎల్ఓలు, వీఆర్వోల ద్వారా ఆయా సచివాలయ పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు అందజేస్తున్నాం. ఎవరికైనా ఓటరు స్లిప్పులు అందకపోతే సంబంధిత వీఆర్వోలను సంప్రదించవచ్చు.
– ధర్మచంద్రారెడ్డి, ఆర్డీఓ, కడప

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు నమోదు చేసుకున్న వారు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఏవైనా సమస్యలు ఎదురైతే కడప ఎలెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రమౌళి (సెల్ నెంబరు 9989531428)ని సంప్రదించవచ్చు.
– శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప

ఘన నివాళి



గంగిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రుద్రు గంగామోహన్‌రెడ్డి తండ్రి రుద్రు గంగిరెడ్డి ఆదివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి బుసిరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగామోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ నర్రెడ్డి శివాంజనేయరెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసులురెడ్డి, సాంబశివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ప్రతాప్ యాదవ్, శ్రీనివాసులురెడ్డి(వాసు), బాలగంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి సానుభూతి

కమలాపురం : వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్బయ్యగారి క్రిష్ణ(56) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదివారం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మహ్మద్ సాదిక్, గఫార్, మోనార్క్, జిలానీ, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి వర్షపు బొట్టును సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్‌వైకే అధికారి మణికంఠ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌వైకే అధికారి మణికంఠ తదితరులు

వైవీయూ: వర్షపు నీటి వృథా చేయకుండా వాటిని సంరక్షించుకుని భూగర్భజలాలు అడుగంటకుండా చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని జిల్లా యూత్‌హాస్టల్‌లో భారత జల్‌శక్తి మంత్రిత్వశాఖ, నేషనల్ వాటర్ మిషన్ ఆదేశాల మార్గదర్శనం మేరకు 'క్యాచ్ ది రెయిన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా వాటిని సంరక్షించుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయని సూచించారు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు తవ్వడం ద్వారా భూగర్భజలాలు అడుగంటి పోకుండా చేయగలమన్నారు. చిత్తూరు జిల్లా ఆరోగ్యవిద్య అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోకున్నా, కాపాడుకోకున్నా భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. అనంతరం వారు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది, యువత పాల్గొన్నారు.

9 నుంచి శంఖవరం ఉరుసు



శంఖవరంలోని దర్గాషరీఫ్ సమాధి

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామంలో గల దర్గాషరీఫ్ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ముజావర్ పి.ఓబయ్య తెలిపారు. స్థానికంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 9న సయ్యద్ ఖాజారహమతుల్ల నాయబేరసూల్, బీబి హబీబా ఖాతూన్ గంధ మహోత్సవం జరుగుతుందన్నారు. గంధం సందర్భంగా పోరుమామిళ్ళ ఆర్యవైశ్య దర్గా ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతుందన్నారు. గంధం రోజు రాత్రి బెంగళూరు వారిచే గొప్ప ఖవ్వాళి కార్యక్రమం ఉంటుందన్నారు. 10న రాత్రి ఉరుసు మహోత్సవం, భక్తులచే అన్నదానం ఉంటుందని తెలిపారు. 11న తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉరుసు మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

- స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్



విజేతలను అభినందిస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప స్పోర్ట్స్: క్రీడాకారులకు నిరంతర సాధన, పట్టుదల, ఆసక్తి ఉంటే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ శిక్షకుడు మస్తాన్‌హుస్సేన్ ఆధ్వర్యంలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్టెప్ సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికి క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. శిక్షణలో బాగా మెలుకువలు నేర్చుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. రెజ్లింగ్ శిక్షకుడు మస్తాన్ హుస్సేన్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల్లో సామర్థ్యాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. యోగ శిక్షకుడు పెంచలయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ మద్దతుదారులను గెలిపించండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలి ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం నగరంలోని శంకరాపురంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు పర్యటించి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మునగా సతీష్, చిన్న కుళాయప్ప, జీఎస్టీ లక్ష్మణ్ రావు, సురేష్‌లు మాట్లాడుతూ ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

అవగాహనతోనే మెరుగైన ఆరోగ్యం



ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్: వ్యాధుల పట్ల అవగాహనతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని రామాస్ శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వై.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌కే మహమ్మద్ అలీ తెలిపారు. ఆదివారం స్థానిక అల్మాస్‌పేటలో రామాస్ శ్రీకర మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో మెదడు, వెన్నముక, అన్ని రకాల జ్వరాలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరాలయానికి పచ్చదనం శోభ



ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన గ్రీనరీ, చెట్టు

కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి భారతి సిమెంట్స్ గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన శివరాత్రి మహోత్సవానికి విచ్చేసిన భారతి పరిశ్రమ ప్రతినిధులను స్థానికులు ఆలయంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన భారతి ప్రతినిధులు పరిశ్రమ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో వెలుపల, లోపల గ్రీనరీ ఏర్పాటు చేశారు. అలాగే అక్కడక్కడా చెట్లు వేయడంతో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. అడిగిన వెంటనే ఆలయ ప్రాంగణంలో గ్రీనరీ ఏర్పాటు చేసిన భారతి యాజమాన్యానికి, ప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

శిల్పారామంలో చిన్నారుల ఆటా..పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై బద్వేలుకు చెందిన కిరణ్ పాఠశాల చిన్నారులు తమ ఆటపాటలతో అదుర్స్ అనిపించారు. చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీ చౌడేశ్వరీ మాత ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం విజయదుర్గాదేవి కాలనీలోని శ్రీ చౌడేశ్వరీమాతను ఆదివారం ఘనంగా ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం, కనుల పండువగా అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వీధి ప్రజలతోపాటు సమీప వీధులు, గ్రామాలకు చెందిన అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ దివ్య జ్ఞానానంద గిరిస్వామి ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి స్థానిక వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోవిందు నాగరాజు, ఆంజనేయులు, రాధాకృష్ణ, సీఆర్‌ఐ సునీల్, కల్యా సుధాకర్, రామచంద్రుడు, సుదర్శన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. నిర్వాహక కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: విద్యాశాఖాధికారులు ఏదో కారణంగా ఉపాధ్యాయులను వేధించడం సరికాదని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ విజయకుమార్ పేర్కొన్నారు. ఇటీవల ఉపాధ్యాయుల పని సర్దుబాటులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన డీఈఓ అక్రమాలకు ప్రశ్నిస్తే ఉపాధ్యాయ సంఘ నాయకులు షోకాస్ నోటీసులు జారీ చేయడం దారుణమన్నారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తనిఖీల పేరుతో ఒక్క పక్క ఉపాధ్యాయులను వేదిస్తూ మరో పక్క ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్నారనే సాకు చూపి ఉపాధ్యాయ సంఘ నాయకులు షోకాస్ నోటీసులను జారీ చేయడం సరికాదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, ఎస్టీయూ రమణారెడ్డి, ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడారు. అధికారులు వేధింపులు మానకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కడప కల్చరల్ : ఏమాత్రం లక్షణాలు కనిపించకుండా వచ్చే కాలేయ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాదుకు చెందిన అపోలో వైద్యులు, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు నవీన్ పోలవరపు తెలిపారు. స్థానిక ఎల్ఐసీ సభా భవనంలో ఆదివారం నిర్వహించిన హెల్త్ టాక్ కార్యక్రమంలో ఆయన ఈ అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. మితమైన ఆహారం, సరైన వ్యాయామం, అప్పుడప్పుడు ఇతర పరీక్షలతోపాటు కాలేయ సంబంధ పరీక్షలు, హెపటైటీస్–బి వ్యాక్సినేషన్ తదితర పరీక్షలు కూడా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మద్యం, ధూమపానం, ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.ఎల్ఐసీ ఎస్‌డీఎం గిరిధర్ మాట్లాడుతూ తమ సంస్థ విక్రయిస్తున్న ఆరోగ్య బీమా పాలసీలకు మంచి ఆదరణ ఉందని, తమ జిల్లాతోపాటు అనంతపురం, కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంవత్సరం బీమా లక్ష్యాలను నెరవేర్చేందుకు ఎల్ఐసీ ప్రతినిధులు కృషి చేస్తున్నారన్నారు. కార్యాలయ సేవల విభాగం మేనేజర్ సత్యనారాయణ సాహు, ఇతర అధికారులు పీవీ నరసింహారావు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులు అవధానం శ్రీనివాస్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో డాక్టర్ నవీన్ డివిజనల్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటారు.

వెన్నపూస గెలుపుకోసం విస్తృత ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాసీమబాబు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మాసీమబాబు, సర్పంచ్ సొంటం నారాయణరెడ్డి రాచిన్నాయపల్లెలో ఓటర్లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కడప నగరంలో 4వ డివిజన్ ఇన్‌ఛార్జి ఆర్వీ రమణ, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్, 4, 6, 22, 30, 31, 44వ డివిజన్ల కార్పొరేటర్లు ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న పురుషోత్తంరెడ్డి, రాము, నిమ్మకాయల వెంకటరెడ్డి తదితరులు ఓట్లను అభ్యర్థించారు.

ఘనంగా ముద్దల పండుగ

వీరపునాయునిపల్లె :పాయసంపల్లె, తలపనూరు, బసిరెడ్డిపల్లె, కొమ్మద్ది, అంకిరెడ్డిపల్లె, మొయిళ్లచెరువు గ్రామాల్లో నిర్వహించిన ముద్దల పండుగ ఆదివారం ఘనంగా ముగిసింది. గ్రామాల్లోని గ్రామ దేవతలకు జంతు బలులు సమర్పించి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. బసిరెడ్డిపల్లెలో బైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, గడ్డంవారిపల్లె సహకారం సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లెలో గంగిరెడ్డి, మొయిళ్లచెరువు సర్పంచు వెంకటరెడ్డి విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహాలను బంధుత్వంగా మార్చుకునే అవకాశం



కార్యక్రమానికి హాజరైన యువతీ యువకుల తల్లిదండ్రులు

కడప కల్చరల్ : మన మధ్య ఉన్న స్నేహాలను ఈ వేదిక ద్వారా బంధుత్వంగా మార్చుకునే అవకాశాన్ని జారనీయకూడదని ఆస్తానే బగ్దాదియా ప్రతినిధి హజరత్ ముఫ్తీ మహమ్మద్ అలీ బగ్దాది సాహెబ్ పేర్కొన్నారు. శని, ఆదివారం రెండు రోజులు నగరంలోని అల్మాస్ ఫంక్షన్ హాలులో రూబరు రిష్తా ములాఖత్ (వివాహ పరిచయ వేదిక)ను నిర్వహించారు. స్థానిక బగ్దాదియా సోదరులు, నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని ముద్దనూరు, వేంపల్లె, ఖాజీపేట, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలతోపాటు చిత్తూరు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి కూడా యువతీ, యువకుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, చేతి వృత్తుల వారు ఇలా అన్నివర్గాలకు చెందిన పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆ వివరాలను తెలియజేసుకున్నారు. ఈ వేదిక ద్వారా వివాహం నిశ్చయం జరిగిన ఆలిమ్ కోర్సు చేసిన అమ్మాయికి కమిటీ తరపున రూ. లక్ష ఆర్థికసాయం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశేష స్పందన లభించిన ఈ కార్యక్రమ నిర్వహణలో 40 మంది కమిటీ సభ్యులు తమవంతుగా సేవలు అందించారని తెలిపారు. ప్రతినెల మొదటి ఆదివారం సాయిపేటలోని అస్థానె బగ్దాదియాలో రిష్తా ములాఖత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బగ్దాదీ బ్రదర్స్ తెలిపారు.